క్లుప్తంగా

సెంటాక్ నాన్‌నీట్ కోర్సులకు ఆహ్వానం

యానాం: 2024–25 విద్యా సంవత్సరానికి గాను సెంటాక్(సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ద్వారా నాన్‌నీట్ యూజీ ప్రొఫెషనల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంటాక్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీటెక్, బీఆర్క్, బీఎస్సీ(హానర్స్), అగ్రికల్చర్, బీవీఎస్‌సీఅండ్ ఏహెచ్, బీఎస్సీ(నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ పారామెడికల్ కోర్సులు, బీఫార్మా, బీఏఎల్ఎల్‌బీ, ఆర్ట్స్ కోర్సులైన బీఏ, బీఎస్సీ, బీకామ్, బీబీఏ, బీసీఏ, ఫైన్ ఆర్ట్స్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

యానాం: ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవలి స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ నిర్వహించిన సేవ్ స్పేరో చిత్ర కళ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బహుమతులు సాధించారని రీజెన్సీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి 39 మంది పాల్గొనగా కేడీవీవీ మణిదీప్, కేఎస్ మౌనిక, పీడీ నవ్యహన్సుజలు తమ ప్రతిభతో జీవవైవిధ్యాన్ని కాపాడుతున్న పిచ్చుకల చిత్రాలను గీసి బహుమతులు పొందారన్నారు. ఈ సందర్భంగా చిత్రకళలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పి.ప్రశాంతికి సైతం ప్రోత్సాహక బహుమతి అందించారన్నారు.

విద్యాకానుక కిట్లను పాఠశాలలకు చేర్చాలి



గొల్లవిల్లి స్టాక్ పాయింట్ వద్ద విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఉప్పలగుప్తం: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లను ప్రతి పాఠశాలకు జూన్ 10లోగా చేర్చాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 12వ తేదీ పాఠశాలలు తెరిచే సరికి పాఠశాల వ్యాప్తంగా కమిటీలు ఏర్పాటు చేయాలని అవగాహన కల్పించారు. విద్యార్థులకు అందజేయడానికి 28,266 నోటు పుస్తకాలు మండలానికి చేరాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 సత్తి సత్యకృష్ణ, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరియాలతిప్పకు సీఎస్ఆర్ నిధులివ్వాలి

యానాం: చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న రిలయన్స్ సంస్థ నుంచి తమ గ్రామ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులివ్వాలని దరియాలతిప్ప గ్రామ పెద్దలు సబ్బతి శ్రీనివాసరావు, కమిడి బాలయోగి, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి తదితరులు కోరుతున్నారు. 2003 నుంచి చమురు కార్యకలాపాలు సాగుతున్నా సరిహద్దునే ఉన్న తమ గ్రామానికి ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదన్నారు. దరియాలతిప్ప నిరుద్యోగ యువతీ, యువకులను ఉపాధి కల్పించాలని, ప్రతి రేషన్ కార్డుకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలన్న డిమాండ్లతో త్వరలోనే నిరసన చేపట్టనున్నామన్నారు.

సీఎం రంగసామిని సత్కరించిన స్పీకర్

యానాం: పుదుచ్చేరిలో ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుని నాలుగో ఏడాదిలో ప్రవేశించిన సందర్భంగా సీఎం రంగసామిని స్పీకర్ ఆర్.సెల్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు బుధవారం ఘనంగా సత్కరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి పోటీచేయడంతో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం పదవిని ఎన్ఆర్ కాంగ్రెస్‌కు, స్పీకర్ పదవిని బీజేపీకి కేటాయించారు. రాజ్యసభ సభ్యుడు పదవితో పాటు 3 నామినేటెడ్ ఎమ్మెల్యే పదవులను సైతం బీజేపీకి కేటాయించారు.

ఎన్నికల బస్సు సర్వీసులకు పీఆర్టీయూ వినతి

సఖినేటిపల్లి: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిమిత్తం ఈ నెల 12, 13 తేదీల్లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తగిన బస్సు సర్వీసులు కల్పించాలని కోరుతూ మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఒక వినత పత్రాన్ని రాజోలు ఆర్టీసీ డీఎం పి.భాస్కరరావుకు బుధవారం అందజేసింది. ఈ మేరకు వివరాలను సంఘ అధ్యక్షుడు పి.హేమ సుందర్‌రావు వివరించారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల నుంచి విధులకు వెళ్లాల్సిన వారికి బస్ సౌకర్యం కల్పించాలని ప్రతినిధులు కోరారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



బోడసకుర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

- ప్రజలు ఓటుతో కూటమికి బుద్ధి చెప్పాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

అల్లవరం: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని బోడసకుర్రు గ్రామంలో బుధవారం ఆయన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి విశ్వరూప్‌కు అడుగడుగునా మహిళలు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు ఎప్పట్లాగే మీ ఇంటి ముంగిటకు చేరాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించవలసిన బాధ్యత సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులందరిపై ఉందన్నారు. ప్రభుత్వం, సంక్షేమ పథకాలపై టీడీపీ కూటమి దుష్ప్రచారం చేస్తుందని, వాటిని ఎవరూ నమ్మొద్దన్నారు. ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి టీడీపీ కూటమి అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజల బంగారు భవిష్యత్‌కు ఫ్యానే దిక్సూచి అవుతుందన్నారు. రానున్న ఫ్యాన్ గాలికి ప్రతిపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రయోజనం పొందిన ప్రతి లబ్ధిదారుడు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. ఎమ్మెల్యేగా విశ్వరూప్‌ను, ఎంపీగా రాపాక వరప్రసాదరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బోడసకుర్రు పల్లిపాలెంలో 30 మంది మత్స్యకారులు విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి విశ్వరూప్ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు దొమ్మేటి శ్రీశాంతిభవాని, బస్వాని పద్మ, గ్రామ కమిటీ అధ్యక్షులు మట్టపర్తి షణ్ముఖరావు, చెల్లుబోయిన రమేష్, చింతా బాబీ, గుత్తుల రాజు, అంబటి శ్రీను, దొమ్మేటి సురేష్, సాపే ధర్మరాజు, బొంతు శ్రీను, పలివెల చిట్టి తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతున్న మంత్రి విశ్వరూప్

సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం



అమలాపురం 11వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్



అల్లవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు

- వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం
- ఫ్యాను గుర్తుకు ఓటేయాలంటూ అభ్యర్థన

ముమ్మిడివరం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ అన్నారు. బుధవారం ఆయన ముమ్మిడివరం నగర పంచాయతీలోని నేరెళ్లపాలెం, అగ్రహారం, ఠానేల్లంక పంచాయతీ వడ్డిగూడెంల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను, ఎంపీగా రాపాక వరప్రసాదరావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండలంలో అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, చినకొత్తలంక, గేదెల్లంక, గాడిలంక, కర్రివానిరేవు తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జీ, పీటీవీ వర్మ, పెద్దిరెడ్డి మునీంద్రరావు, నగుబత్తుల రామకృష్ణారావు, ఎస్.సుదర్శన్, పాము శ్రీనివాసరావు, గిరిగి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప్‌ను ముచ్చటగా మూడోసారి గెలిపిద్దాం

అమలాపురం టౌన్: ప్రజలకు మంచి చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను అమలాపురం నుంచి ముచ్చటగా మూడోసారి గెలిపించాలని ఆయన సతీమణి బేబీ మీనాక్షి, తనయులు కృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌లు ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక 27వ వార్డులో బేబీమీనాక్షి, కృష్ణారెడ్డి, 11వ వార్డులో డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మెండు రమేష్‌బాబు, కముజు రమణ, చింతా రవికుమార్, కౌన్సిలర్లు బండారు గోవింద్, గొవ్వాల రాజేష్, చిత్రపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం 27వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి

జగనన్నకు అండగా మేమంతా సిద్ధం

అల్లవరం: జగనన్నకు అండగా మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. కొమరగిరిపట్నంలో అల్లూరి సురేష్‌రాజు ఆధ్వర్యంలో ప్రచారం సాగించారు. కార్యక్రమంలో గోసంగి వెంకటేశ్వరరావు, ఉప్పే సతీష్, కుంచే నాగరాజు, కొనుకు బాబురావు, మల్లాడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం నగర పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న పితాని బాలకృష్ణ తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాసరావు కోరారు. బండారులంక గ్రామంలో బుధవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాలెపు శ్రీను, గుత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ

ఎన్నికల సిబ్బంది ద్వారా బట్వాడా

అమలాపురం టౌన్: గతంలో ఎన్నికలు జరుగుతున్నాయంటే చాలు ఆయా పార్టీల అభ్యర్థుల తాలూకు అనుచరులు, పార్టీల కార్యకర్తలు పోలింగ్ ముందు రోజు ఇంటింటికీ ఇచ్చి ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేసేవారు. ప్రైవేటు వ్యక్తులు అందించిన ఆ స్లిప్పులతోనే ఓటర్లు మెర్నాడు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేవారు. గతంలో పోలింగ్ కేంద్రాల వద్ద దూరంగా స్లిప్పుల పంపిణీకి ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేక శిబిరాలు కూడా ఏర్పాటు చేసేవారు. అయితే ఈసారి ఎన్నికల్లో ఎన్నికల సంఘం నియమావళిని తు.చ. తప్పకుండా అమలు చేస్తోంది. ప్రైవేటు వ్యక్తులు లేదా పార్టీల కార్యకర్తలు ఇంటింటికీ వచ్చి ఓటర్ల స్లిప్పులు ఇచ్చే విధానానికి పూర్తి చరమ గీతం పాడేలా చర్యలు చేపట్టింది. స్వయంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు(బీఎల్‌వో) తమ పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఇళ్లకు ఓటర్ల జాబితాతో వెళ్లి ఆయా కుటుంబాల్లోని ఓటర్ల వివరాలు అడుగుతున్నారు. ఓటరు స్థానికత రుజువు అయిన పిదపే ఆ జాబితాలో టిక్కులు పెట్టుకుంటున్నారు. ఆ తర్వాతే ఓటరు సమాచార స్లిప్పును అధికారికంగా పంపిణీ చేస్తున్నారు. ఈ విధానం జిల్లాలో గత వారం రోజులుగా ముమ్మరంగా జరుగుతోంది.



అమలాపురంలో ఓటరు సమాచార స్లిప్పులు ఇచ్చేందుకు వచ్చిన బీఎల్‌వో

ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయట్లేదు



జిన్నూరి వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయట్లేదని వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని నంగవరం గ్రామంలోని బుధవారం తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు తరువాత ఈసీ వైఖరిలో చాలా మార్పులు వచ్చిందన్నారు. దగాపరుడైన చంద్రబాబు చెప్పినట్టల్లా ఈసీ నిర్ణయాలు తీసుకుంటే ప్రజాస్వామ్యానికి విలువ ఎక్కడుందన్నారు. వలంటీర్లతో ఇళ్ల వద్దకే పింఛన్లు ఇవ్వడాన్ని అడ్డుకుని వృద్ధుల క్షోభకు కారణమయ్యింది చంద్రబాబేనన్నారు. ఎన్నికలయ్యే వరకూ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడానికి లేదని కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.610 కోట్ల మేర విద్యా దీవెన నిధులు ఆపడం మీకు తగునా అని ఆయన ప్రశ్నించారు.

చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

అమలాపురం టౌన్: రాష్ట్ర జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్, లీగల్ సెల్ కమిటీల మాజీ అధ్యక్షుడు మట్టపర్తి మురళీకృష్ణ తదితరులు ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞప్తి చేశారు. అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీసీ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే 56 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఇచ్చారని, సీఎం జగన్ మాత్రమే బీసీల డిమాండ్లను నెరవేర్చగలరన్నారు. 2029 ఎన్నికల నాటికి చట్ట సభల్లో 50 శాతం(175లో) సీట్లు అంటే 88 సీట్లు బీసీలకు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని ఏ పట్టణంలోనైనా మహాత్మా జ్యోతిరావు పూలే 132 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వీరవల్లి చినబాబు, పిచ్చుక ప్రభాకరరావు, కాండ్రేగుల వరప్రసాద్, పలివెల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

రావులపాలెం: పండించిన పంట ఈదురుగాలులకు పడిపోవడంతో ఒక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై రావులపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొమరాజులంకకు చెందిన ద్వారంపూడి బుచ్చిరెడ్డి (56) బుధవారం ఉదయం తాను సాగు చేస్తున్న అరటి తోట వద్దకు వెళ్లి పురుగుమందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. మంగళవారం ఈదురు గాలులతో అరటి తోట పడిపోవడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగినట్లు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకుని అతన్ని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఓటమి భయంతోనే పథకాల అడ్డగింపు



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- భైరవపాలెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం: ఓటమి భయంతోనే టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తూ పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకుంటుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని భైరవపాలెం, తీర్థాలమొండి గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అడుగడుగునా పూలు జల్లుతూ అభిమానులు, మంగళహారతులిచ్చి మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. నవరత్న పథకాలతో నిరుపేదల కుటుంబాలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకే దక్కింది. ప్రజలను ఇబ్బంది పెట్టడమే టీడీపీ, జనసేన లక్ష్యమని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు వణుకు పుట్టిస్తున్నాయన్నారు. ఎవరు ఎంత ప్రయత్నించినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. అవినీతి రహిత పాలన కొనసాగాలన్నా, సంక్షేమ పథకాలు గడప వద్దకే చేరాలన్నా, రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందించాలన్నా మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, పెమ్మాడి బాబూరావు, ఢిల్లీ నారాయణ, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



భైరవపాలెంలో ఎమ్మెల్యే పొన్నాడకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళ

దివ్యాంగుల సంఘీభావం



దివ్యాంగులతో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దువారి వీధిలో వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో దాదాపు 200 మంది దివ్యాంగులు మంత్రి పినిపే విశ్వరూప్‌కు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యాంగుల సమ్మేళనానికి మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అనంతరం వంటెద్దు వెంకన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారపు పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

నిఘా బృందాల విస్తృత తనిఖీలు

మద్యం అక్రమ రవాణా చేస్తున్న పది మంది అరెస్ట్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అక్రమ రవాణాను నిఘా బృందాలు అడ్డుకునే చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జిల్లాలో మంగళ, బుధవారాల్లో జరిగిన అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలను ఎస్పీ కార్యాలయం తెలిపింది.

- జిల్లాలో అక్రమ రవాణాపై నిఘా బృందాలు విస్తృత దాడులు చేసి 8 కేసులు నమోదు చేసి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశాయి. వారి నుంచి 12 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 149 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 28.98 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు.
- ద్రాక్షారామ, మండపేట పోలీసు స్టేషన్ల పరిధిలో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 28 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 4.04 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులు నమోదు చేశారు.
- జిల్లాలో జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, ఎదుర్లంక, దిండి, నరసాపురపుపేట జిల్లా చెక్ పోస్ట్‌ల్లో బుధవారం నిఘా బృందాలు పలు వాహనాలు ఆపి విస్తృత తనిఖీలు చేశాయి.
- అల్లవరం మండలం గూడాల, బోడసకుర్రు గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, అమలాపురంలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన లిక్కర్ గొడౌన్‌ను జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎంపీ చంద్రకాంత్ తనిఖీ చేశారు.



జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేస్తున్న నిఘా బృందాల ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే గన్‌మన్‌కు గాయాలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గన్‌మన్ సురేష్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళుతున్న సురేష్, మరో ద్విచక్రవాహనంపై వస్తున్న దొమ్మేటిపేటకు చెందిన విజయ్ కుమార్‌లు స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో సురేష్‌తో పాటు విజయ్‌కుమార్‌కూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.